ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

శనివారం 3 ఆగస్టు 2024

పన్ను చెల్లింపులకు నెలాఖరుదాకా ఓటీఎస్

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) సదుపాయం నెలాఖరుదాకా పొడిగించారు. జూలై ఆఖరుదాకా గడువు ఉండేదని ప్రస్తుతం మరో నెలరోజులు పొడిగించినట్లు బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ శుక్రవారం ప్రకటించారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్తి ప న్ను ఎక్కడ చెల్లించాలనే గందరగోళానికి తావు లేదని, 1533 టోల్‌ఫ్రీ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు. ఓటీఎస్ విధానంతో బీబీఎంపీకి జూలై ఆఖరుకు రూ.3,200 కోట్లు పన్నులు వసూలయ్యాయని తెలిపారు.



బెంగళూరులో మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



మాగడి నియోజకవర్గంలో బహిరంగ సభలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వేడెక్కుతున్న రాజకీయం

- బీజేపీ ఆధ్వర్యంలో నేడు చలో మైసూరు పాదయాత్ర
- కలిసి వస్తున్న జేడీఎస్
- దీటుగా కాంగ్రెస్ 'జనాందోళన' సమావేశాలు

రోడ్డెక్కుతున్న నాయకులు

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన రెండు నెలల తర్వాత ప్రధాన రాజకీయ పార్టీ నాయకులంతా రోడ్డెక్కుతున్నారు. శాసనసభ సమావేశాల్లో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 187 కోట్ల అవినీతిపై దద్దరిల్లిన విషయం తెలిసిందే. ఇక మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో ఇళ్ల స్థలాల పంపిణీలో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట 14 ఇళ్ల స్థలాలు కేటాయించడం వివాదాస్పదమయింది. శాసనసభలో చర్చకు అవకాశం లేకపోవడంతో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ చలో మైసూరుకు సిద్ధమయ్యాయి. బీజేపీ, జేడీఎస్‌ను ఎదుర్కొనేందుకు అధికార కాంగ్రెస్ కూడా నడుంబిగించింది. ముడా అవినీతిపై బీజేపీ చలో మైసూరు పాదయాత్రను శనివారం శ్రీకారం చుడుతుండగా ఒకరోజు ముందే ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సారథ్యంలో శుక్రవారం నిర్వహించిన సభ విమర్శలకు వేదిక అయ్యింది. మరికొన్ని గంటల్లో బీజేపీ-జేడీఎస్ పాదయాత్ర, అందుకు వ్యతిరేకంగా అధికార కాంగ్రెస్ నైతిక ప్రశ్నల సభ ఎక్కడికి దారి తీస్తుందోనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ పాదయాత్రకు బలం చేకూరేలా ముడా అవినీతిపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సంచలనమైంది. ఇది రాజకీయ కుట్ర అని, రాజ్‌భవన్‌ను, గవర్నర్‌ను బీజేపీ-జేడీఎస్ వాడుకుంటున్నాయని, కేంద్రప్రభుత్వం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారని సీఎం సిద్దరామయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు.



మీడియాతో జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్

నేడు 'చలో మైసూరు' పాదయాత్ర

కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను తుది స్థాయి వరకు కొనసాగిస్తామని బీజేపీ-జేడీఎస్ సమష్టిగా పాదయాత్ర చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తెలిపారు. మల్లేశ్వరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం చలో మైసూరు పాదయాత్ర వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇది పేదల వ్యతిరేక ప్రభుత్వం అన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. అహింద పేరిట రాజకీయంగా ఎదిగిన సిద్దరామయ్య అన్ని కులాలకు అన్యాయం చేశారని ఆరోపించారు. శాసనసభ లోపలా, బయటా పోరాటం చేస్తున్నామని తెలిపారు. తాము లేవనెత్తిన ప్రశ్నలకు సీఎం, డీసీఎం సమాధానం చెపాల్సని డిమాండ్ చేశారు. 8 రోజుల పాదయాత్రకు మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, కేంద్రమంత్రి కుమారస్వామి కెంగేరిలో శనివారం ఉదయం ప్రారంభిస్తారని తెలిపారు. పాదయాత్ర తొలిరోజు 16 కిలోమీటర్లు సాగుతుందన్నారు. ఆదివారం బిడది నుంచి 22 కిలోమీటర్లు, ఆ తర్వాత 15-20 కిలో మీటర్ల చొప్పున కొనసాగుతుందన్నారు. ప్రతిరోజూ 8-10వేలమంది పాల్గొంటారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్‌ను ప్రశ్నించేలా కొత్త చరిత్ర సృష్టించిందన్నారు. గవర్నర్ నోటీసుకు సమాధానమివ్వకుండా కేబినెట్‌లో గవర్నర్‌ను ప్రశ్నించే పనిచేశారన్నారు. సీఎం అన్నింటికి పరారీ అవుతున్నారని తెలిపారు. తమ పోరాటం వ్యక్తి కోసం కాదని, వ్యవస్థ కోసమన్నారు. కాంగ్రెస్ పశ్చాత్తాపయాత్ర చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జేడీఎస్ పార్టీ ఎలాంటి షరతులు విధించలేదన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్, నాయకులు అనిల్‌బెనక, ఏఎస్ పాటిల్ నడహళ్ళి తదితరులు పాల్గొన్నారు.

అది అవినీతిపరుల పాదయాత్ర : డీకే శివకుమార్

అవినీతిపరులు అవినీతి కోసం చలో మైసూరు పాదయాత్ర చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మండిపడ్డారు. శుక్రవారం బిడదిలో నిర్వహించిన జనాందోళన సభలో ఆయన బీజేపీ, జేడీఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. పాదయాత్ర ద్వారా తమకు పవిత్రమైన జనాందోళన చేసుకునే అవకాశం కల్పించారని అన్నారు. బీజేపీ పాలనలో బోవి కార్పొరేషన్‌లో రూ.87 కోట్లు, అగ్రికల్చర్ మార్కెట్‌లో రూ.47 కోట్ల అవినీతి జరిగిందని, అప్పుడు ముఖ్యమంత్రి ఎవరని ప్రశ్నించారు. దేవరాజ్ అరసు ట్రక్ టెర్మినల్‌లో ఎమ్మెల్సీ వీరయ్య జైలుపాలు ఎందుకయ్యారని ప్రశ్నించారు. కుమారస్వామి అధికారం కోసం జేడీఎస్ పార్టీనే త్యాగం చేశారని ఎద్దేవా చేశారు. దేవెగౌడ ఈ జిల్లాకు వచ్చి తన కర్మభూమి, పుణ్యభూమి అన్నారని, మీ కుటుంబమంతా అధికారం అనుభవించిందని తెలిపారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయ్యారని గుర్తు చేశారు. కుమారస్వామి భార్య ఇక్కడి నుంచే ఎమ్మెల్యే అయ్యారన్నారు. అయినా పాదయాత్రలో మీ జెండా లేదని, మీకు ఆత్మాభిమానం లేదా...? అని ప్రశ్నించారు. తన ఆస్తుల గురించి మాట్లాడేముందు కుమార తమ కుటుంబ ఆస్తుల గురించి బహిరంగం చేయాలని డిమాండ్ చేశారు. మీ అన్న బాలకృష్ణగౌడ ఓ అధికారి ద్వారా తమ కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేయలేదా అని ప్రశ్నించారు. బాలగంగాధరనాథస్వామిజీపై ఎలా కేసు పెట్టారో గుర్తు చేసుకోవాలన్నారు. రామనగర, చెన్నపట్టణ, మాగడి, కనకపుర ప్రాంతాల ఆత్మాభిమానాన్ని వదులుకునేది లేదన్నారు. ఒక్కరోజులో మేకెదాటుకు అనుమతులు తెస్తానని చెప్పుకున్నావని, ఏం చేశావని ప్రశ్నించారు. నోరు తెరిస్తే అబద్ధాలేనని, మరెంతకాలం ఇలా వ్యవహరిస్తారని మండిపడ్డారు. కాగా, బెంగళూరులో బీజేపీ పాదయాత్ర చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం అవుతుందని అనుమతులు ఇచ్చేది లేదని ప్రకటించిన డీసీఎం డీకే శివకుమార్ మాత్రం శుక్రవారం బైక్‌ర్యాలీలో హెల్మెట్ లేకుండానే పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వాహనం నడపగా వెనుక కూర్చున్న డీకే శివకుమార్ కూడా హెల్మెట్ ధరించలేదు.

పాదయాత్రలో విభేదాలు లేవు : నిఖిల్

చలో మైసూరు పాదయాత్రలో బీజేపీ, జేడీఎస్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ తెలిపారు. శుక్రవారం చాముండేశ్వరి దేవిని దర్శించుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.89 కోట్ల అవినీతి జరిగిందని ప్రకటించారని తెలిపారు. ముడాలో ఎవరికి లబ్ధి జరిగిందో అందరికీ తెలుసు అన్నారు.



బైక్ ర్యాలీలో హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, వెనుక కూర్చున్న డీకే శివకుమార్

బీజేపీకి పోటీగా కాంగ్రెస్ సమావేశాలు

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముడాలో అక్రమాలను ఖండిస్తూ బీజేపీ చలో మైసూరు పాదయాత్రకు సన్నద్ధం కాగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం, బీజేపీ-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయంటూ జనాందోళన పేరిట సమావేశాలకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది. శుక్రవారం బిడదిలో సమావేశం నిర్వహించింది. కాగా 3న శనివారం రామనగరలో, 4న చెన్నపట్టణలో, 5న మద్దూరులో, 6న మండ్యలో, 9న మైసూరులో సమావేశాలు ఉంటాయని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

అమిత్‌షాతో మేఘాలయ గవర్నర్ భేటీ

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మేఘాలయ గవర్నర్‌గా నియమితులైన మైసూరు వాసి సీహెచ్ విజయశంకర్ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను భేటీ అయ్యారు. ఢిల్లీ వెళ్లిన విజయశంకర్, హోం మంత్రిని గురువారం కలిశారు. మేఘాలయ గవర్నర్‌గా అవకాశం దక్కడంపై ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న గవర్నర్ విజయశంకర్

నానో టెక్నాలజీలో రాష్ట్రం ముందంజ

- అంతర్జాతీయస్థాయిలో పరిశోధనల భాగస్వామ్యం అవసరం
- 13వ విడత సదస్సు ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నానో టెక్నాలజీలో రాష్ట్రం ముందంజలో ఉందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బెంగళూరు ఇండియా నానో 13వ విడత సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సుస్థిరతకోసం నానో టెక్నాలజీలో వాతావరణంలో మార్పులు ఇంధనం, ఆరోగ్యరక్షణకు ప్రాధాన్యత పెరగనుందన్నారు. ఆహారం, ఇంధనం, నీటిశుద్ధీకరణ వంటి అంశాల్లో నానో టెక్నాలజీ ద్వారా శాస్త్రవేత్తలు ఎన్నో ఆవిష్కరణలు సాధ్యం చేశారని, మరింత సరళీకృతం కావాల్సి ఉందన్నారు. భారతరత్న గ్రహీత డాక్టర్ సీఎన్ఆర్ రావు సారథ్యంలో ఎన్నో ఆవిష్కరణలు సాధ్యమయ్యాయని కొనియాడారు. అధునాతన సాంకేతికత సాధనాలు పూర్తిస్థాయిలో వినియోగానికి అంతర్జాతీయస్థాయిలో పరిశోధనల భాగస్వామ్యం అవసరమన్నారు. ఇటువంటి అంతర్జాతీయ సదస్సులు యువశాస్త్రవేత్తల్లో కొత్త ఆలోచనలు కలిగిస్తాయని అన్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ నానో, క్వాంటమ్ టెక్నాలజీ ప్రగతితో ప్రభుత్వం అందరితో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందని, బెంగళూరును అగ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. నానో టెక్నాలజీతో అన్ని రంగాల్లో సమర్థవంతంగా ఉత్పాదన సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయం, విద్యుత్, ఆహార సంస్కరణ, పారిశ్రామిక రంగాల్లో తక్కువ ధరతో ఎక్కువ ఉత్పాదన చేసి జనస్నేహి కావాలన్నారు. మెటీరియల్ సైన్స్, ఫార్మసీతోపాటు అన్ని విభాగాల్లోనూ ప్రగతి అవసరమని తెలిపారు. బయోటెక్నాలజీ, ఐటీ రంగాల్లో అనేక పరిశోధనా సంస్థలు బెంగళూరును అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లాయన్నారు. వేలాదిమంది శాస్త్రవేత్తలు బెంగళూరులో శిక్షణపొందారని, మనందరికీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయులన్నారు. రాష్ట్రం లో 300 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని, ఏడాదికి రెండు లక్షల మంది విద్యార్థులను బయటకు వస్తున్నారని తెలిపారు. భారతరత్న ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు యువతకోసం నానో అనే అంశంపై ప్రసంగించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎస్ఎస్ బోసరాజు, బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, విజన్ గ్రూప్ ఛైర్మన్ ప్రొఫెసర్ నవకాంత్‌భట్, ప్రొఫెసర్ అనిల్‌కుమార్, ఐటీ బీటీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ ఏక్‌రూప్‌కౌర్, పవన్‌కుమార్ మాలపాటి, సైన్స్ అండ్ టెక్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జగదీశ్ పట్నాకర్, ప్రొఫెసర్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల సదస్సులో 75మంది వక్తలు 35 సెషన్స్‌లో పాల్గొంటారని, 700 మంది ప్రతినిధులు, ఆరు దేశాల భాగస్వాములు, 50కుపైగా ఎగ్జిబిటర్స్, 3500మందికి పైగా సందర్శకులు పాల్గొంటారని ప్రతినిధులు ప్రకటించారు.



సదస్సులో సీఎం సిద్దరామయ్య, డాక్టర్ సీఎన్ఆర్ రావు, కిరణ్‌మజుందార్‌షా తదితరులు

యూనియన్‌బ్యాంకు రీజనల్‌శాఖకు అధికారిక భాషా పురస్కారం

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, బీమా కంపెనీలు శుక్రవారం నిర్వహించిన 77వ అర్ధవార్షిక సమావేశంలో 2023-24కు సంబంధించి బెంగళూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఉత్తర విభాగానికి బహుమతి లభించింది. అధికారిక రాజభాష అమలు కమిటీ (నరకస్) కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. కెనరా బ్యాంకు సీఎండీ కె. సత్యనారాయణ రాజు, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ అధికారి రాజేంద్రకుమార్‌కు షీల్డ్ అందించారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్‌కుమార్ బిశ్వాస్‌తోపాటు కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర పాల్గొన్నారు. అధికారిక భాషా విభాగం అధికారి రేణుక, రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ప్రింటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్త, నరకస్ సభ్యుడు ఇ. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందచేస్తున్న కెనరాబ్యాంకు సీఎండీ కె. సత్యనారాయణ రాజు తదితరులు






బళ్లారి రాఘవ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న న్యాయాధికారి శాంత తదితరులు, బళ్లారి రాఘవ రాష్ట్ర అవార్డు గ్రహీత రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయాధికారి తదితరులు

కళాకారులను ప్రోత్సహించాలి

- భారతీయ సంస్కృతి పెంపునకు దోహదం
- బళ్లారి రాఘవ జయంత్యుత్సవాల్లో న్యాయాధికారి శాంత

బళ్లారి సిటీ, ఆగస్టు 2: విభిన్న కళాకారులను ప్రోత్సహిస్తే మన భారత సంస్కృతిని పెంచినవారవుతారని జిల్లా ప్రధాన న్యాయాధికారి జె.శాంత తెలిపారు. బళ్లారి రాఘవ 144వ జయంత్యుత్సవాలను శుక్రవారం బళ్లారి రాఘవ మెమోరియల్ అసోషియషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.చెన్నప్ప అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జె.శాంత, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కులపతి ఎస్ఎన్ రుద్రేశ్, రాఘవ మెమోరియల్ అధ్యక్షుడు కోటేశ్వరరావు నేతృత్వంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధాన న్యాయాధికారి శాంత మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించి భారత సంస్కృతిని పెంచాలని సూచించారు. కవులు, కళాకారులు ఉన్న సమాజం ఎంతో అవసమని పేర్కొన్నారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయ కులపతి ఎస్ఎన్ రుద్రేశ్ మాట్లాడుతూ బళ్లారి రాఘవ ప్రపంచ దేశాల్లోనే గుర్తింపు పొందినకళాకారుడని గుర్తు చేశారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డ్రామా హాలుకు రాఘవ పేరును నామకరణమని చేయడానికి ప్రస్తావిస్తామని అన్నారు. ఈ సందర్భంగా బళ్లారి రాఘవ రాష్ట్ర అవార్డు గ్రహీత రాజేంద్రప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మరణమృదంగం కన్నడ నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, రమేశ్‌గౌడ పాటిల్, రామాంజనేయులు, క్రిష్ణశ్యామ్ సుందర్, ప్రకాశ్ తదితర సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.22	1,626.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,97,468	29,763
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,78,851	2099
సామర్థ్యం (టీఎంసీలు)	98.73	81.54

పెరోల్‌పై వచ్చిన ఖైదీ అరెస్టు



పెరోల్ ఖైదీని అరెస్టు చేసిన ఎస్పీ శోభారాణి, డీఎస్పీ

బళ్లారిరూరల్, ఆగస్టు 2 : టెక్కలకోట పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఉత్తనూర్ గ్రామానికి చెందిన కొరచార నాగప్ప అలియాస్ నాగప్ప ఓ మహిళ హత్య కేసులో కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. అతడి తల్లి అనారోగ్యంతో బాధపడుతుండడంతో 2020 సంవత్సరంలో పెరోల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ జైలుకు వెళ్లకుండా నాలుగు సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనిని ఎస్పీ శోభారాణి, డీఎస్పీ వెంకటేష్, సీఐ సుందరి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు టెక్కలకోట పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టెక్కలకోట పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ డాక్టర్ శోభారాణికి ఘన సన్మానం



శోభారాణిని సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, ఆగస్టు 2: బళ్లారి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ శోభారాణిని శుక్రవారం సన్మానించారు. మోకా మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్ అనసూయ, ఎర్రగుడి ప్రిన్సిపాల్ భారతి, ఎర్రంగలి ప్రిన్సిపాల్ మల్లిస్వామి, గాంధీ తత్వ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఎర్రంగలి ప్రథానోపాధ్యాయుడు నాగప్ప, రాయపురం సురేష్ తదితరులు ఎస్పీ డాక్టర్ శోభారాణిని ఘనంగా సన్మానించారు.

దోమల బెడద నుంచి కాపాడుకోవాలి



వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్న డీహెచ్ఓ రమేష్‌బాబు


బళ్లారి సిటీ, ఆగస్టు 2: డెంగ్యూ వైరస్ వ్యాప్తి చెందించే ఏడిస్ దోమల బెడద నుంచి రక్షణ పొందేందుకు వేపనూనె, కొబ్బరినూనె కలిపి నిద్రించే సమయంలో చేతులకు కాళ్లకు రాసుకుని పడుకోవాలని జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేష్‌బాబు కోరారు. ఏడిస్ దోమల నివారణలో భాగంగా శుక్రవారం నగరంలోని గాంధీనగర్, నాగలచెరువు ప్రాంతాల్లోని ఇళ్లను సందర్శించిన ఆయన మాట్లాడారు. డెంగ్యూ వ్యాధికి నిర్దిష్ట చికిత్స లేనప్పటికీ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో లక్షణాల ఆధారంగా వైద్యం అందిస్తున్నారు. డెంగ్యూ వ్యాధిని వ్యాపింపచేసే లార్వా ఉత్పత్తి కాకుండా ప్రతివారం పాఠశాలలు అంగన్ వాడీ కేంద్రాల్లో నీటిని తనిఖీ చేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లా ఎంట మాలజిస్ట నందకాడి, జిల్లాకార్యాధికారి ఈశ్వరదాసనప్పవర్, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ధూళి నుంచి విముక్తి కలిగించండి

కంప్లి, ఆగస్టు 2 : కంప్లి పట్టణం బళ్లారి రోడ్డు ఎల్ఐసీ ఆఫీసు నుంచి వెలకమ్ బోర్డు వరకు జరుగుతున్న రోడ్డు పనుల వలన దుమ్ముధూళి ఇళ్లలోకి చేరుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం వలన పనులు మాత్రం ఆగుతూ సాగుతూ జరుగుతున్నాయన్నారు. వరతుల ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు రోడ్డుపై నీరు చల్లాలని, కానీ నీరు చల్లక పోవడంతో వాహనాల సంచారంతో దుమ్ముధూళి లేస్తోందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వదిలి మట్టి రోడ్డుపై నీరు చల్లేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కమలంలో పెరిగిన పోటీ

- గుబులురేపుతున్న సండూరు ఉప ఎన్నిక
- బీజేపీలో నలుగురు ఆశావహులు
- కాంగ్రెస్ టిక్కెట్ మంత్రి సంతోష్‌లాడ్ అనుచరులకే



బళ్లారి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజులు ఏలే గడ్డగా పేరు గడించిన సండూరు విధానసభ ఉపఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ నుండి ఏకంగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తుకారాం తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి విజయం సాధించడంతో ఈ సీటు ఖాళీ అయిన విషయం విదితమే. తాజాగా ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం తెలిసిందే.

ఎమ్మెల్యేగా గెలిచిన తుకారాం రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేసి గెలిచిన నేపథ్యంలో సండూరు విధానసభకు ఉపఎన్నికలు అనివార్యం అయ్యాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్, బీజేపీ రెండూ ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగానే భావిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్టానం కన్నా ఇక్కడ ఉండే రాజ వంశానికి చెందిన సంతోష్ లాడ్ కుటుంబం అంగీకారం ముఖ్యం, అలాగే బీజేపీ అభ్యర్థి నియామకం లోనూ గాలి జనార్ధనరెడ్డి, గొర్రెడే రాజుల మాటే కీలకం అనేది వాస్తవం. బీజేపీ నుంచి నలుగురి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మాజీ ఎంపీ దేవేంద్రప్ప కుమారుడు, లేదా వారి కుటుంబంలో ఒకరు, అలాగే గాలి జనార్ధనరెడ్డి ముఖ్యఅనుచరుల్లో ఒకరయిన దివాకర్, లేదా ఇంతకు ముందు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన మాజీ మంత్రి శ్రీరాములు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరు కాకుండా కాంగ్రెస్‌లో ఇప్పటి వరకూ బలంగా ఉన్న ఒకరిని బీజేపీలోకి చేర్చుకుని వారికి బీజేపీ టికెట్ ఇవ్వాలనే కోణంలో కూడా వారి ఆలోచనలుసాగుతున్నట్లు తెలుస్తోంది.

తన సన్నిహితుడైన దివాకర్‌కు ఇస్తే బాగుంటుందని గాలి జనార్ధనరెడ్డి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రతో సూచనాప్రాయంగా తెలిపినట్లు సమాచారం. ఇంతకు ముందు జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో దివాకర్ సండూరు క్షేత్రంలో గాలి జనార్ధనరెడ్డి స్థాపించిన కల్యాణ కర్నాటక రాష్ట్ర ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) నుంచి పోటీ చేశారు. ఆయనకు అప్పట్లో సుమారు 30 వేల ఓట్ల పైచిలుకు వచ్చాయి. అంతే కాకుండా దివాకర్‌కు సండూరులో మంచి పట్టు ఉంది అనే విషయం పార్టీకి తెలిపారని సమాచారం.

ఇక మాజీ ఎంపీ దేవేంద్రప్ప కుమారుడు, లేదా కోడలిని రంగంలోకి దించాలని కూడా చర్చ సాగుతోంది. ఇంతకు ముందు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అభ్యర్థిని తిరిగి పోటీలో నిలపాలని కొందరు కోరుతున్నారు. ఈ కోటాలో మాజీమంత్రి శ్రీరాములు పోటీ చేయాలని చూస్తున్నారు.

ఇంతకు ముందు ఎమ్మెల్యే ఎంపీగా పోటీ చేసి ఓడిన శ్రీరాములు ఇప్పుడు తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే పరిస్థితి ఎలా మారుతుందో తెలియదు. గెలుస్తామా..? ఓడుతామా..? అనే అయోమయ పరిస్థితిని ఆయన ఎదుర్కొంటున్నారు. సండూరులో కాంగ్రెస్, బీజేపీ ఎవరైనా సరే అభ్యర్థుల ఎంపిక విషయంలో అక్కడ ఉండే ఘోర్పడే రాజులు అయిన సంతోష్ లాడ్, గోర్పడే లాంటి వారి మాట కాదని నిర్ణయం తీసుకునే అవకాశం ఉండదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి నాగేంద్రను ఎస్టీ నిగమ మండలి అక్రమాల ఆరోపణలపై ఈడీ అరెస్టు చేసింది. పైగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై కూడా ముడా అథారిటీ (మైసూర్ డెవలప్‌మెంట్ అథారిటీ) లో స్థాలు తీసుకున్నారనే ఆరోపణలతో ప్రతిపక్షం రోజు దుమ్మెత్తిపోస్తోంది. ఇలాంటి సమయంలో కమలం సండూరు ఉపఎన్నికను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. ఈ ఉపఎన్నికలను అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీజేపీ రెండూ ప్రతిష్ఠాత్మకంగానే భావిస్తున్నాయి. అయితే ఎన్నికలు ఎప్పుడు అనేది ఇంకా నోటిఫికేషన్ విడుదల కాక ముందే పార్టీలు సండూరులో క్షేత్ర స్థాయి పర్యటనలు సాగించడం విశేషం.

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

బళ్లారి సిటీ, ఆగస్టు 2: నగరంలోని రాఘవ కళామందిరంలో శుక్రవారం బళ్లారి రాఘవ 144వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదటగా బళ్లారి జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాఘవ కళామందిరం నుంచి గడిగెచెన్నప్ప సర్కిల్ వరకు రాఘవ చిత్రపటాన్ని ఊరేగించి అక్కడున్న రాఘవ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కోశాధికారి ,ధనుంజయ, శ్యామ్‌సుందర్, యల్లనగౌడ శంకరబండె, కార్యదర్శి ముద్దటనూరు తిప్పేస్వామి, రంగభూమి కార్యదర్శి ప్రభుదేవ, ఆదెప్పస్వామి, రమణప్ప భజంత్రి, సుబ్బణ్ణ, పురుషోత్తమ, నాగనగౌడ, మంజునాథ్ గోవిందవాడ, కుమార్‌గౌడ, చంద్రశేఖర్, పుష్పలత,లక్ష్మి, పవన్‌కుమార్, తదితర కళాకారులు పాల్గొన్నారు.



రాఘవ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న కళాకారులు

మకరబ్బి, బాలహున్సి రహదారి బంద్

- పొంగిపొర్లుతున్న తుంగభద్ర నది

బళ్లారిసిటీ, ఆగస్టు 2:తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో ఒక్కసారిగా పెరిగి నది ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది. దీంతో హూవినహడగలి తాలూకాలోని నదీతీర గ్రామాలకు ముంపుముప్పు ఏర్పడింది. మకరబ్బి, బాలహున్సి గ్రామాల బ్రిడ్జిలు నీట మునగడంతో ఈ మార్గం మూసుకుపోయింది. దీంతో ఈరహదారి గుండా వెళ్లే పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హూవినహడగలి తాలూకాలో నది ఒడ్డున ఉన్న కురువత్తి గ్రామంలోకి నీరు చేరడంతో అధికారులు ముందుజాగ్రత్త చర్యగా నాలుగు కుటుంబాలను తరలించారు. గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో బాధితుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. నాలుగు కుటుంబాలకు చెందిన 15మంది అక్కడ ఆశ్రయం పొందారు. గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. నదీతీర గ్రామాలైన హరవి, లింగనాయకనహళ్లి, అంగూర్, కోటిహాల, నందిగావి, హొసహళ్లి, హిరేబన్నిమట్టి, మకరబ్బి, బాలహున్సి, నవలి, కొంబలి తదితర గ్రామాల వ్యవసాయ భూముల్లోకి వరద నీరు వచ్చిచేరింది.



రహదారులు జలమయం కావడంతో నీటిలో నడిచిపోతున్న జనం



మదలగట్టి ఆంజనేయస్వామి దేవాలయాన్ని చుట్టుముట్టిన నీరు

వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, చెరకు, వేరుశనగ పంటలు నీట మునిగాయి.

రాజ్‌వాల గ్రామ సమీపంలోని సింగటలూరు ఎత్తిపోతల ప్రాజెక్టు బ్యారేజీలో ఉదయం 1,99,211క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. బ్యారేజీ 18గేట్లను తెరిచి అదే స్థాయిలో నీటిని నదిలోకి వదులుతున్నారు. తాలూకాలోని ప్రసిద్ధ మదలగట్టి ఆంజనేయస్వామి దేవాలయం చుట్టూ నది ప్రవహిస్తోంది. తహశీల్దార్ అమరేశ్ నదీ తీరంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.

నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నందున నదిలోకి వెళ్లకూడదని హెచ్చరించారు. పశువులను నడిచేదుకు తీసుకెళ్లరాదని, ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తిచేశారు. వరద మరింత పెరిగితే నది ఒడ్డున ఉన్న 10గ్రామాల్లో సంరక్షణ కేంద్రాలను ప్రారంభించేందుకు తగిన స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ భూములు ముంపునకు గురికావడంతో పంటలన్నీ నీటమునిగాయి. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖలు సర్వే నిర్వహించి పంట నష్టంపై సమాచారం సేకరిస్తాయని తహశీల్దార్ అమరేశ్ తెలిపారు.

పురుగుల మందు తాగి ప్రేమికుల ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్నవారి శవాలను పరిశీలిస్తున్న సీఐ హనుమంతప్ప

సిరుగుప్ప, ఆగస్టు 2 : సిరుగుప్ప పట్టణానికి చెందిన ఓ యువతీయువకులు శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నారు. 25వ వార్డుకు చెందిన యువతి పవిత్ర (19), 24వ వార్డుకు చెందిన రాజా (22) ఇద్దరు రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. తెల్లవారుజామున ఇద్దరూ కలిసి ఆదోని రోడ్డు ఎలర్‌పన్ ఫారం ఎదురుగా బాగవత కాలువ పక్కన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి శవాలను పరిశీలించారు. మృతదేహాలను అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టమ్ పూర్తి చేశారు. శివగంగ ఆయిల్ మిల్లులో రాజా హెల్పర్‌గా పని చేస్తుండగా పవిత్ర కూలీ పనులు చేస్తూ వుండేది. ఇద్దరు ప్రేమించుకున్నారు. ఇద్దరు వేర్వేరు వర్గాలు చెందిన వారయినప్పటికీ వివాహం చేసుకునేందుకు ఇరు వురి పెద్దలు సహకరించలేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరువురు కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. ఈ కేసును సీఐ హనుమంతప్ప దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలి



హెచ్చెల్సీ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేను అభినందిస్తున్న రైతులు

కంప్లి, ఆగస్టు 2 : ప్రతి రైతు కాలువల ద్వారా వచ్చే ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కోరారు. ఆయన శుక్రవారం తుంగభద్ర హెచ్చెల్సీ కింది భాగంలోని ఉప కాలువలను పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల రైతులు ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకుని పొదుపుగా వాడుకోవాలన్నారు. జలాశయం నిండి బాగుపడితేనే మాత్రమే వర్షాలు కురుస్తున్నాయని దీంతో ఆశ్చర్యకర శాతం నీరు జలాశయానికి చేరుతోందన్నారు. జలాశయం కింది భాగంలో వర్షం లేక నీటి సమస్య ఏర్పడిందన్నారు. కావున ఆయకట్టు రైతులు జలాశయం ద్వారా వచ్చే నీటిని పొదుపుగా వాడుకుని పుష్కలంగా పంటలు పండించుకోవాలన్నారు. కర్నాటక, ఆంధ్ర, తెలంగాణకు కూడా ఎడమ కాలువల నుంచి నీరు అందుతుంద న్నారు. ఇండెంట్ ప్రకారమే ఉప కాలువ నీరు తీసుకెళ్లి రైతులు తమ పంటలను పండించుకోవాలన్నారు. రైతులు పొలాల్లో నీటిని నిల్వ చేసుకుని వృథా చేయరాదన్నారు. రైతులు పొలాల నుంచి వాగులు, వంకలకు నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే హెచ్చెల్సీ కాలువల ద్వారా ఉపకాలువలకు విడుదల చేసిన నీటిని చిన్ననీటిపారుదల శాఖాధికారులు రైతుల పొలాలకు సక్రమంగా అందుతున్నదా అన్నదానిపై దృష్టిసారించాలన్నారు. అనంతరం డీపీ-7, డీపీ-8, డీపీ-10 ఇతర ఉప కాలువలను పరిశీలించారు. డీపీ -7 వద్ద సిద్ధమ్మనహళ్లి, బాదనట్టి, ఎర్రంగళి, సిందిగేరి, కురుగోడు, గ్రామాల రైతన్నలు ఆయనను సన్మానించారు.

ఆటోలోనే బిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి..!



మహిళకు ప్రసవం చేస్తున్న స్థానిక మహిళలు

రాయచూరు, ఆగస్టు 2 : కాన్పు కోసం ఆస్పత్రికి వెళుతుండగానే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఆటోలోనే మగ బిడ్డకు జన్మనిచ్చిన ఓ మహిళ ఉదంతం ఇది. ఈ సంఘటన జిల్లాలోని మస్కి పట్టణంలో శు క్రవారం ఉదయం చోటు చేసుకుంది. మస్కి పట్టణంలోని సంతబజార్‌లో నివసిస్తున్న మహిళ ఒకరు పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కాన్పు కోసం ఆమెను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆటోలో వెళుతుండగా నొప్పులు అధికం కావడంతో డ్రైవర్ వెంటనే మధ్యలోనే ఆటోను నిలిపి వేసి ఇరుగుపొరుగు మహిళల సహాయం అర్థించారు. దీంతో అక్కడికి చేరుకున్న స్థానిక మహిళలు ఆటో చుట్టూ పరదాలు ఏర్పాటు చేసి మహిళకు ప్రసవం చేశారు. విషయం తెలుసుకున్న ఆశా కార్యకర్తలు అక్కడికి చేరుకుని బిడ్డను, తల్లిని ఆస్పత్రికి చేర్చి చికిత్సఅందించారు.

594వ రోజుకు చేరిన రైతుల నిరసన

కంప్లి, ఆగస్టు 2: కుడితిని పట్టణంలో కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకున్న రైతన్నలు చేస్తున్న పోరాటం 594 రోజులకు చేరింది. తమకు న్యాయం లభించే వరకు ఈ పోరాటం తప్పదని సీఐటీయు పదాధికారి తిప్పేస్వామి, చెన్నబసయ్య, జంగిసాబ్, తదితర రైతన్నలు తెలిపారు. ఇన్ని రోజులుగా నిరసనలు చేపడుతున్నా ఇంతవరకు రైతులకు న్యాయం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆందువల్ల ఆగస్టు 6వ తేదీన పట్టణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. వారితో పాటు రైతులు అంజినప్ప తాయప్ప, పంపాపతి, సిద్దప్ప, నారాయణప్ప, రామన్న, నాగమ్మ, దేవమ్మ, నీలమ్మ, రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రదర్శన



టాస్మాక్ దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రదర్శన

హోసూరు ఆగస్టు 2: హోసూరు సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా తమిళనాడు రైతు సంఘం, హోసూరు తాలూకా గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకు సర్కిల్ కమిటీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి అధ్యక్షత వహించారు. హోసూరు సమీపంలోని జెకాట్‌పల్లి ప్రాంతం కూటూరు వద్ద ప్రభుత్వ నూతన మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు పరిశీలించి పనులు ప్రారంభించారు. ఇందుకు నిరసనగా తమిళనాడు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో జూలై 13 న హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అయినా కూటూరులో దుకాణం ఏర్పాటు చేసేందుకు టాస్మాక్ యాజమాన్యం కసరత్తు కొనసాగిస్తోంది. దీంతో ఇక్కడ దుకాణం ఏర్పాటుచేస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, తమిళనాడు రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు, మహిళలు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్‌కందన్ మాట్లాడుతూ మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకుంటామన్నారు. ఈ ప్రదర్శనల్లో సర్కిల్ కార్యదర్శి అనందకుమార్, మున్సిపల్ నాయకులు మహేష్, మంజునాథ్ నటరాజ, శ్రీని వాసులు, మంజప్ప, రమేష్, అశ్విని దేవి పాల్గొన్నారు. డెంకణీకోట డీఎస్పీ శాంతి, టాస్మాక్ దుకాణం అధికారులు , పోలీసులు తమిళనాడు రైతు సంఘం నాయకులతో చర్చలు జరిపి మద్యం దుకాణం ఏర్పాటు చేయబోమని హామీ ఇచ్చారు. అనంతరం ప్రదర్శనను విరమించుకున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ

హోసూరు(సిప్‌కాట్) ఆగస్టు 2: ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వ తేదీ వరకు జరిపే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం హోసూరు గుణం ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ఎదుట ప్రారంభమైన ఈ ర్యాలీని వైద్యులు వనితా ప్రదీప్‌కుమార్, కవితా సెంథిల్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆసుపత్రి నర్సులు పెద్ద సంఖ్యల్లో పాల్గొని, తల్లిపాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

డీఎంకే అధికార ప్రతినిధి కుమరన్‌పై ఫిర్యాదు

హోసూరు ఆగస్టు 2: పీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రామదాస్, వన్నియార్ గౌడాన్ సంఘంపై సోషల్ మీడియాలో అవమానకరమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలను పోస్ట్ చేసిన డీఎంకే అధికారి ప్రతినిధి కుమరన్‌పై కృష్ణగిరి పశ్చిమ జిల్లా పీఎంకే నాయకులు హోసూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 25న పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ తన జన్మదిన వేడుకల్లో మాట్లాడుతూ, వన్నియార్లకు రిజర్వేషన్ల అంశంపై డీఎంకే ప్రభుత్వ చేపడుతున్న చర్యలను విమర్శించారు. దీనిపై స్పందించిన వేలూరు జిల్లాకు చెందిన డీఎంకే కుమరన్ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో డాక్టర్ రామదాస్‌పై అనుచితంగా వ్యాఖ్యలను పోస్ట్ చేశాడు. దీంతో కృష్ణగిరి పశ్చిమ జిల్లా ద్రావిడ జనుల పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరాజులు ఆధ్వర్యంలో వన్నియార్ సంఘానికి చెందిన 60 మంది ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హోసూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న ఇన్‌స్పెక్టర్ ఈ విషయంలో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కుమరన్‌పై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

విద్యాభివృద్ధికి కేకేఆర్‌డీబీ నుంచి గ్రాంట్



తోరణగల్లులో జ్యోతి వెలిగించి విద్యాసదస్సును ప్రారంభిస్తున్న మంత్రి

- విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప

బళ్లారి సిటీ, ఆగస్టు 2: కళ్యాణ కర్నాటకలోని ఏడు జిల్లాల విద్యాభివృద్ధికి 25శాతం గ్రాంట్‌ను ప్రాంతీయ అభివృద్ధి బోర్డు(కేకేఆర్‌డీబీ) కేటాయిస్తుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కలబురగి డివిజన్, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తోరణగల్లు జేమ్యాక్స్ హాల్లో నిర్వహిస్తున్న విద్యాసదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్నాటకలోని ఏడు జిల్లాల్లో వెయ్యికి పైగా ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందని, ఇప్పటికే కళ్యాణ కర్నాటకలో 1160 మంది అతిథి ఉపాధ్యాయులను నియమించామన్నారు. ఈ ప్రాంతంలో పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు వెనుకబడడం బాధాకరమన్నారు. విద్యార్థుల రాక కోసం ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఎన్‌ఈఈటీ శిక్షణ

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు నీట్ జేఈఈ, ఇతర ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక రుసుము చెల్లించి కళాశాల స్థాయిలో కోచింగ్ పొందుతున్నారు. సీఈటీ, నీట్ సహా పలుకోర్సుల్లో ద్వితీయ పీయూలో ఉత్తీర్ణులైన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం రూ. 12కోట్లతో శిక్షణ ఇప్పించిందని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఎస్ఎస్ఎల్సీ పరీక్ష సందర్భంగా వెబ్‌కాస్టింగ్ చేయడం ఆదేశించినట్లు తెలిపారు. గతేడాది నుండి మూడుసార్లు ప్రవేశపెట్టడం వల్ల పెయిల్యూర్ రేటు తగ్గిందన్నారు. పదవతరగతిలో చేరే పిల్లలకు పాఠ్యపుస్తకాలు,షూలు,సాక్సులు ,మధ్యాహ్న భోజనంతో పాటు ఇతర పిల్లల మాదిరిగానే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టీచింగ్ నాన్‌టీచింగ్ సిబ్బంది భర్తీకి అవసరమైన గ్రాంట్లు ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల నియామకానికి కూడా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఈసందర్భంగా కలబురగి డివిజన్ పాఠశాల విద్య ,అక్షరాస్యత విభాగం డిప్యూటీ కమిషనర్ ఆకాశ్‌శంకర్, జేఎస్‌డబ్ల్యూ అధ్యక్షుడు మురుగన్, సీఈఓ హర్షవర్ధన నవతే, వడ్డు గ్రామ అధ్యక్షులు నింగమ్మ,నాగరాజు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంట్...

శ్రీపాద పినాకపాణి (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత శ్రీపాద పినాకపాణి 1913 ఆగస్టు 3న శ్రీకాకుళం జిల్లా ప్రియ అగ్రహారంలో జన్మించారు. రోగాలను, రాగాలను సరిచేసిన సవ్యసాచి. డాక్టర్, ప్రొఫెసర్‌గానే కాకుండా కర్ణాటక సంగీతంలో సత్తా చాటుకుని వైద్య, సంగీత రంగాలలో ఆయన శిష్యులు సైతం పేరొందారు. 2012లో టీటీడీచే 'జ్ఞాన విద్యా వారధి' పురస్కారం అందుకున్నారు. సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి, సంగీత నాటక అకాడమీ, కళాప్రపూర్ణ పురస్కారాలు అందుకున్నారు. సంగీతం వింటూనే నొటేషన్స్ రాయ గల నైపుణ్యం ఆయనది. గురువులకే గురువుగా రాణించారు. విశాఖపట్నంలో వైద్యకళాశాల సివిల్ సర్జన్‌గా పనిచేశారు. అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజ కృతులు 607, ముత్తుస్వామి దీక్షితుల కృతులు 173 తదితర వాటికి ఆయన స్వరపరిచారు. 2013 మార్చి 11న దివంగతులయ్యారు.

షకీల్ బదయూని (జయంతి)



షకీల్ బదయూని 1916 ఆగస్టు 3న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బదయూన్ ప్రాంతంలో జన్మించారు. బాలీవుడ్‌లో ఉర్దూ కవిగా, స్వరకర్తగా, హిందీ సినిమాలకు గేయ రచయితగా పేరొందారు. బైజు బావ్రా, మొఘల్-ఎ-ఆజమ్, బీస్ సాల్ బాద్, చౌద్విన్ కా చాంద్, సాహిబ్ బీబీ ఔర్ గులాం తదితర సినిమాలకు పాటలు రాశారు. నౌషాద్‌తో కలసి షకీల్ రాణించారు. ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలతోపాటు ఉత్తమగీత రచయితగా పేరొందారు. కేంద్ర ప్రభుత్వంచే 'గీత్ కర్-ఏ-ఆజం' పురస్కారం అందుకున్నారు. 1970 ఏప్రిల్ 20న కన్నుమూశారు. 2013లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపు విడుదలైంది.

స్వామి చిన్మయానంద (వర్ధంతి)



స్వామి చిన్మయానంద సరస్వతి 1916 మే 8న కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జన్మించారు. పూర్వ నామం బాలకృష్ణ మీనన్. హిందూ ఆధ్యాత్మికవేత్తగా, ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. చిన్మయా మిషన్ ఏర్పాటు చేసి అద్వైత వేదాంతం, భగవద్గీత, ఉపనిషత్తులు, పురాణాల గురించి ప్రచారం చేశారు. దేశ విదేశాలలో 300కుపైగా శాఖలు ఉన్నాయి. విశ్వహిందూ పరిషత్ స్థాపనలోనూ కృషి చేశారు. 1970లో బెంగళూరులో చిన్మయా మిషన్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. 200 పడకలతో ఆధునీకరించారు. 1993 ఆగస్టు 3న కన్నుమూశారు. ఇప్పటికీ మిషన్ సేవలు కొనసాగుతున్నాయి. 2015లో ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక కాయిన్ విడుదల చేశారు.

వాణిశ్రీ (పుట్టినరోజు)



వెండితెరపై కళాభినేత్రిగా పేరొందిన దక్షిణాది ప్రముఖ నటీమణులలో ఒకరైన వాణిశ్రీ 1948 ఆగస్టు 3న నెల్లూరులో జన్మించారు. అసలు పేరు రత్నకుమారి. నాలుగు దశాబ్దాలలో తెలుగు, తమిళ, కన్నడ హిందీ భాషలలో ఎన్నో సినిమాలలో నటించారు. నాదీ ఆడజన్మే చిత్రంలో అవకాశానికి వెళ్లినప్పుడు ఎస్వీ రంగారావు ఆమెకు 'వాణిశ్రీ' అనే పేరు పెట్టారు. రఘుపతి వెంకయ్య అవార్డు, 3 ఫిల్మ్ ఫేర్, నంది, తమిళనాడు రాష్ట్ర పురస్కారాలు అందు కున్నారు. 1970 దశకంలో ఆమె హీరోయిన్‌గా నటించిన దసరాబుల్లోడు, ప్రేమనగర్ సినిమాలు ఎంతో పేరొందాయి. సామాజిక సేవలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించారు.

భర్తను చంపిన భార్య

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భర్త చేతులు, కాళ్లు కట్టేసి భార్య దారుణంగా హత్య చేసిన సంఘటన కలబురగి నగరం ఆర్‌జినగర్‌లో చోటు చేసుకుంది. ఈశ్వర్ (26) హత్యకు గురైన వ్యక్తి. ఇతను కలబురగి నగరంలోని కనకనగర్ నివాసి. ఆటో డ్రైవర్. నాలుగేళ్ల క్రితం రంజితను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఓ శిశువు ఉన్నారు. ఇటీవల కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విబేధాలు ఉన్నాయి. భార్యతోపాటు బిడ్డను చూసేందుకు ఈశ్వర్ మామ ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఈశ్వర్ హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్‌జి నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. భార్య రంజిత దారుణానికి పాల్పడినట్టు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.

బస్సు, బైక్ ఢీ.. విద్యార్థి మృతి

చింతామణి, ఆగస్టు 2: కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా అడ్డగల్ గ్రామ సమీపాన కేఎస్ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొన్న ఘటనలో కళాశాల విద్యార్థి మృత్యువాత చెందాడు. చింతామణి పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ప్రథమ పీయూసీ చదువుతున్న భార్గవ్‌రెడ్డి (18) మృతుడిగా గుర్తించారు. ఇతడి స్వగ్రామం శ్రీనివాసపుర తాలూకా తమటంపల్లె. ఎస్ఎస్ఎల్‌సి పాసైన ఇతను ఇటీవల చింతామణి ప్రైవేట్ కాలేజీలో చేరాడు. శుక్రవారం ఉదయం సమయానికి బస్సు రాకపోవడంతో ద్విచక్ర వాహనంపై కాలేజీకి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు శ్రీనివాసపుర నుంచి అడ్డగల్ మార్గంలో కొప్పవారపల్లి గ్రామం మీదుగా వస్తుండగా భార్గవ్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న గౌనిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకున్నారు. భార్గవ్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులు రోదించగా ప్రైవేట్ కళాశాల యాజమాన్యం కళాశాల సెలవు ప్రకటించింది. పాలకమండలి సభ్యులు, విద్యార్థులు గ్రామానికి చేరి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

పావగడ, ఆగస్టు 2: ఎలుగుబంటి దాడిలో రైతు తీవ్రంగా గాయపడ్డారు. పొలాన్ని కాపుకాసేందుకు వెళ్లే సమయంలో ఎలుగుబంటి దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం ఉదయం 6గంటల సమయంలో పెమ్మనహళ్లిలో చోటుచేసుకుంది. రైతు సంజీవప్ప తన తోటలో సాగుచేసిన రాగిపంటను పరిశీలించేందుకు వెళ్లాడు. గుట్టల మధ్య వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా గుట్ట చాటు నుంచి వచ్చిన ఎలుగుబంటి దాడి చేసి తలకు, వెన్నెముకకు తీవ్ర గాయపరిచింది. పక్కనే ఉన్న రైతులను గట్టిగా కేకలు వేయడంతో వారు సమయానికి స్పందించి రైతును కాపాడారు. సంజీవప్పను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

గ్రామీణ రవాణాకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే

బాగేపల్లి, ఆగస్టు 2: తాలూకాలోని గ్రామీణ ప్రాంతాలకు రవాణా సదుపాయం మెరుగు చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం నూతన బస్సు సేవలకు పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డరపల్లి గ్రామం తదితర గ్రామాలకు సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. కరోనా క్లిష్టంలో పలు మార్గాల్లో బస్సు సేవలు ఆగిపోయాయన్నారు. పెనలపర్తిలో నైట్‌హాల్ట్ అయ్యే నాన్‌స్టాప్ బస్సు, ముమ్మడివారిపల్లి మార్గంలో బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన పల్లెలకు రవాణా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. బాగేపల్లి డిపోలో 15ఏళ్లు ముగిసిన పాత బస్సులను మార్పు చేయనున్నట్లు తెలిపారు. మరో రెండు మూడు నెలల్లో కొత్త బస్సులు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది రాజణ్ణ, చలపతి, ప్రముఖులు రామనాథ, విశ్వ, ఏఎస్ఐ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వడ్డరపల్లి సర్వీసుకు పచ్చజెండా చూపుతున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి

కర్ణాటక రథానికి ఘన స్వాగతం



కన్నడ రథానికి స్వాగతం పలుకుతున్న పట్టణ వాసులు

బంగారపేట, ఆగస్టు 2: మైసూరు నుంచి కర్ణాటకగా మరు నామకరణం చేసి 50 సంవత్సరాలైన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సువర్ణ మహోత్సవం ఘనంగా ఆచరిస్తోందని తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రవికుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో తాలూకా యంత్రాంగం, పురసభ, కన్నడ సంఘాలు, వాగ్దేవి విద్యానికేతన్ ఆధ్వర్యంలో కర్ణాటక సంభ్రమ 50వ రథోత్సవానికి ఘన స్వాగతం పలికారు. వివిధ కళాబృందాలు పాల్గొన్నాయి. కన్నడిగులంతా ఒక్కటే అనే సౌహార్ద్ర సందేశంతో కన్నడమాత భువనేశ్వరి చిత్రపటంతో కూడిన రథాన్ని స్వాగతించారు. కన్నడభాషకు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందని, సాంస్కృతిక, రాజకీయ, విద్య పరంపర ఉందన్నారు. వీటిని భావితరాలక పదిలంగా అందించేలా మనం కృషి చేయాలని తహసీల్దార్ రశ్మి అభిప్రాయపడ్డారు. పురసభ ముఖ్య అధికారి సత్యనారాయణ, సీడీపీఓ మునిరాజు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి అంజలిదేవి, వ్యవసాయ అధికారి ప్రతిభా, పురసభ సభ్యులు షంషుద్దీన్‌బాబు, ఆరోగ్యరాజన్, షఫి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు శ్రేష్ఠం

మహదేవపుర, ఆగస్టు 2: శిశువు సమగ్ర ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్ఠమని సీనియర్ ఆరోగ్య అధికారి కేఆర్ గురురాజ్ అభిప్రాయపడ్డారు. కేఆర్‌పుర నియోజకవర్గంలోని మేడహళ్ళి కర్ణశ్రీ లే అవుట్‌లో అంగన్‌వాడీ కేంద్రం2లో తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకుని గర్భిణీ, బాలింతలకు ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించారు. కేఆర్‌పుర ప్రాంతీయ అంగన్‌వాడీ కేంద్రం అధికారి శ్రీశైల కన్నాళ్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు తన ఆరంభంనుంచే ప్రముఖమైన పోషకాంశాలు కూడి ఉంటాయన్నారు. నవజాత శిశువుకు సూక్ష్మమైన జీర్ణ వ్యవస్థకు దోహదపడేలా అవసరమైన ప్రొటీన్‌లు తల్లిపాలలో ఉంటాయన్నారు. శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు చేసిందన్నారు. ఇదే సందర్భంగా గర్భిణీలలో పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి, చిన్నారులకు టీకాల గురించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సురక్షాధికారి యశోదమ్మ వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి మంజునాథ్, ప్రాథమిక ఆరోగ్య సురక్షాధికారి మహాలక్ష్మి, శశికళ, హంస, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న గర్భిణీలు, బాలింతలు తదితరులు

సర్జాపుర అధ్యక్షురాలిగా మమత



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

దొమ్మసంద్ర, ఆగస్టు 2: ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర గ్రామపంచాయతీ నూతన అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతుదారురాలు ఎస్ఎస్ మమతా రమేశ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఓంశక్తి మంజునాథ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన గీతా ప్రకటించారు. నూతన అధ్యక్షురాలు మమతా మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో ఏకగ్రీవ సాధ్యమైందని, పంచాయతీలో ఎటువంటి భేదాలు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ సీఆర్ మనోహర్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు. మాజీ అధ్యక్షుడు ఎస్‌వై శంభయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వ గ్రాంట్లతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేశ్, సునితా శశిధర్, సభ్యులు సతీశ్‌కుమార్, నవీన్‌కుమార్, మంజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వర్షం.. రైతుల ఆనందం

విజయపుర, ఆగస్టు 2: దేవనహళ్ళి తాలూకాలోని విజయపుర పట్టణంలో ఎట్టకేలకు వర్షం కురిసింది. 20 రోజులుగా దాగుడుమూతలాడుతున్న వర్షం శుక్రవారం మధ్యాహ్నం గంటకుపైగా వర్షం కురిసింది. దీంతో చకోరపక్షుల్లా ఎదురుచూస్తున్న రైతుల్లో హర్షం వ్యక్తమైంది. రాగి, కంది తదితర విత్తన పనులకు అనుకూలం కానుందని రైతులు పేర్కొన్నారు. కాగా శుక్రవారం వారపు సంతలో అకస్మికంగా కురిసిన వర్షంతో కూరగాయలు తడిసిపోవడంతో సాధారణం కంటే తక్కువధరకు విక్రయించడం సామాన్యమైంది. పలు చోట్ల రోడ్లపై వర్షపునీరు నిలిచింది. సుబ్బమ్మ చన్నప్ప సముదాయభవనం రోడ్డు మొత్తం జలమయమైంది. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



సంతలో కురుస్తున్న వర్షం



పట్టణంలో జలమయమైన రహదారి

అపోలోలో రోబోటిక్ రేడియో సర్జరీ విధానం



వైద్య బృందం తదితరులు

బెంగళూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అపోలో కేన్సర్ సెంటర్ బెంగళూరుశాఖలో ఆసియాలోనే తొలి అత్యాధునిక సైబర్ నైఫ్ ఎస్7 ఎఫ్ఐఎం రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభించారు. కేన్సర్‌తోపాటు కేన్సర్‌లేని కణితలకు పరిణామకారిగా చికిత్సలు అందించేందుకు వీలుంటుంది. సైబర్ నైఫ్ సిస్టమ్‌ను పరిచయం చేయడం ద్వారా కేన్సర్ బాధితులకు ఉత్తమ పరిష్కారం సూచించినట్టు అవుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. కేన్సర్‌ను ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్సలు సులభతరమన్నారు. అపోలో ఆసుపత్రుల వైస్‌ఛైర్మన్ డాక్టర్ ప్రీతారెడ్డి మాట్లాడుతూ అపోలో కేన్సర్ సెంటర్‌లో ఖచ్చితమైన వైద్య విధానాలను అందిస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలుగా కేన్సర్ చికిత్సలు అందించడంలో ప్రగతి పరంగా ఉన్నామన్నారు. రేడియేషన్ ఆంకాలజిస్టులు శ్రీధర్, వినయ్ ఉరల్, విక్రమ్ మయ్య తదితరులు సైబర్ నైఫ్ విధానాన్ని వివరించారు.

తల్లి మృతిని జీర్ణించుకోలేక ఆత్మహత్య

శిడ్లఘట్ట, ఆగస్టు 2: తల్లి మృతిని జీర్ణించుకోలేని అక్కాతమ్ముళ్లు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శిడ్లఘట్ట పట్టణంలోని ప్రేమనగర్ నివాసులు అక్క శిల్ప (24), తమ్ముడు ప్రభు (22) మృతి చెందినవారిగా గుర్తించారు. శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై తల, మొండెం వేర్వేరుగా పడిన మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తొలుత ప్రేమికులై ఉంటారని భావించారు. అయితే అక్క తమ్ముడు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా నిర్ధారించారు. ఆరు నెలలక్రితం తల్లి మృతి చెందింది. అప్పటినుంచి తీవ్ర మనస్తాపానికి లోనైన వీరు చివరకు గురువారం రాత్రి బెంగళూరు నుంచి చిక్కబళ్ళాపుర, శిడ్ల ఘట్ట మార్గంలో కోలారుకు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికంగా ఈ ఘటన విషాదం కలిగించింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



అక్క శిల్ప, తమ్ముడు ప్రభు (ఫైల్)

కళలు మన సంప్రదాయ వారసత్వం

నటుడు విజయ రాఘవేంద్ర



నటుడు విజయ రాఘవేంద్రకు సన్మానం

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కళలు మన సంప్రదాయ వారసత్వమని ప్రముఖ నటుడు, దర్శకుడు విజయరాఘవేంద్ర అభిప్రాయపడ్డారు. శ్రీకృష్ణ ఇంటర్నేషనల్ విద్యాసంస్థలో సాధన 2024 అంతర పాఠశాలల సాంస్కృతిక ప్రదర్శనలు ఆరంభించారు. 25 విద్యాసంస్థలనుంచి విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడు, వైస్‌ఛైర్మన్ జలజాక్షమ్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి విజయ రాఘవేంద్ర మాట్లాడుతూ చదువుతోపాటు కళల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్యాన్సర్‌ను జయించినవారికి 'ది పవర్ టు హీల్' పేరిట గౌరవం



కోలుకున్నవారు, వైద్యబృందం తదితరులు

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ మహమ్మారి నుంచి కోలుకుని ఆరోగ్యవంతులైనవారికి మణిపాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ది పవర్ టు హీల్ పేరిట గౌరవించారు. ఆంకాలజీ విభాగంచే జరిగిన కార్యక్రమంలో పలువురు తమ అభిప్రాయాలతోపాటు బాధలను పంచుకున్నారు. టిష్యూ, బ్రెస్ట్ కేన్సర్, లుకేమియాతోపాటు వివిధ రకాల కేన్సర్ బారిన పడి కోలుకున్నవారు మాట్లాడారు. 44ఏళ్ల ప్రీతిరాకేశ్ పాంచాల్ అభిప్రాయం మేరకు 2013లో తీవ్రమైన కాలినొప్పి రావడంతో ఎంఆర్ఐ జరిపించగా మోకాలు కిందిభాగంలో అరుదైన కేన్సర్‌ను గుర్తించారన్నారు. సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ షబ్బర్ జవేరి నేతృత్వంలో చికిత్సలు అందించినట్టు తెలిపారు. డాక్టర్ జవేరి మాట్లాడుతూ ఒకప్పుడు కేన్సర్ అంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. మారుతున్న సమాజంలో ఎక్కువమందికి కేన్సర్ ప్రబలుతోందని అయితే అత్యాధునిక వైద్యవిధానాలు అందుబాటులోకి రావడంతో చికిత్సలు సులభతరం అయ్యాయన్నారు. కానీ కీమోథెరపీతోపాటు పలు వేగవంతమైన చికిత్సలకు ప్రాథమిక దశలో గుర్తించడమే కీలకమన్నారు. పదేళ్లక్రిందట శస్త్ర చికిత్సలు జరిపించుకున్నవారు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఇలా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

'నమ్మ హోమియోపతి' లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరణలో సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో పేరొందిన నమ్మ హోమియోపతి సంస్థ లోగోను సీఎం సిద్దరామయ్య లాంఛనంగా ఆవిష్కరించారు. హోమియోపతి విధానం అత్యంత పురాతనమైనదని సీఎం అభిప్రాయపడ్డారు. హోమియోపతి ద్వారా జబ్బుల నియంత్రణకు వీలుందన్నారు. సంస్థ సీనియర్ వైద్యులు డాక్టర్ ఆశారాణి, డాక్టర్ స్నేహలను సీఎం అభినందించారు.

9న సామూహిక వరలక్ష్మీ వ్రతం

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం (భారతీ సత్సంగం) ఆధ్వర్యంలో ఈనెల 9న సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నారు. శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని మారతహళ్ళి మున్నెకోలాలలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు వ్రతం ప్రారంభమవుతుందన్నారు. పూజల్లో పాల్గొనే ముత్తైదువులకు అవసరమయ్యే పూజా సామగ్రిని విహెచ్‌పి దక్షిణకర్ణాటక ఉపాధ్యక్షులు సమ కూరుస్తారని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

మార్కెట్‌లోకి రియల్ మి 13 ప్రో

బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏఐ టెక్నాలజీతో అనుసంధానం కల్గిన అత్యాధునిక కెమెరా తదితర సౌలభ్యాలు కల్గిన రియల్ మి 13 ప్రొ సిరీస్ 5జి ఫోన్‌ను మార్కెట్‌లోకి లాంచనంగా విడుదల చేశారు. బెంగళూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో క్వాల్‌కామ్ ఇండియా బిజినెస్ హెడ్ సౌరబ్ అరోరా ప్రకటించారు. రియల్ మి ద్వారా ద్వారా అత్యాధునిక మొబైల్‌లు, వాచీ లు, ఇయర్‌బడ్స్ తీసుకొచ్చామన్నారు. 13 ప్రొ సిరీస్ రూ.23,999గా ఉందని, రియల్‌మి వాచ్ రూ.4499, బడ్స్ రూ.2199గా నిర్ధారించామన్నారు. రియల్ మి మార్కె ట్‌లో వేగవంతంగా మూవింగ్ ఉందన్నారు. అన్ని వర్గా లకు అందుబాటులోకి ఉండేలా మోడల్స్ తీసుకొచ్చా మన్నారు.

ఎయిమ్స్ కోసం ఢిల్లీలో ధర్నా

పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస

రాయచూరు, ఆగస్టు 2 : జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం ఈ నెల 7వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు దిగుతున్నట్లు ఎయిమ్స్ ఏర్పాటు పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 813 రోజులుగా తాము నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎయిమ్స్ ఏర్పాటు కోసం రాయచూరు జిల్లా ఒక్క పేరును మాత్రమే ప్రతిపాదించినా కేంద్రం నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం దృష్టిని ఆకర్షించేందుకే తాము ఢిల్లీ వేదికగా ఆందోళనకు సిద్ధపడినట్లు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ఒక్క రోజు ధర్నాలో పాల్గొనవల్సిందిగా కల్యాణ-కర్ణాటక ప్రాంతానికి చెందిన పార్లమెంట్ సభ్యులందరిని కోరామని తెలిపారు. రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు కోసం గత లోకసభ సభ్యుడు బీజేపీకి చెందిన రాజా అమరేశ్వర్ నాయక్ అప్పట్లో లేఖ రాశారని, ప్రస్తుత సమావేశాల్లో లోకసభ సభ్యుడు కాంగ్రెస్‌కు చెందిన జి. కుమార్‌నాయక్ సైతం ఎయిమ్స్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించారని అయినా కేంద్రం తాత్సారం చేయడం దారుణమన్నారు. తాము చేపడుతున్న ఆందోళనకు పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరు హాజరుకావాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న బసవరాజ్ కళస

మంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో రికార్డు స్థాయిలో ప్రయాణాలు



బెంగళూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్వహిస్తోంది. తొలి త్రైమాసికంలో 5,52,689 మంది ప్రయాణించారు. వీరిలో 3,93,598 మంది దేశీయ ప్రయాణికులు, 1,59,091 మంది అంతర్జాతీయ ప్రయాణికులు ఉన్నారు. గత ఏడాది తొలి త్రైమాసికంలో 4.57 లక్షల మంది ప్రయాణించారు. గత ఏడాదితో పోలిస్తే 21శాతం పెరిగారు. మంగళూరు నుంచి అంతర్జాతీయ సర్వీసులలో అబుదాబి, దుబాయ్, బహ్రెయిన్, దమామ్, దోహా, జెడ్డా, కువైట్, మస్కట్ తదితర 8 దేశాలకు అత్యంత ఎక్కువ మంది ప్రయాణించారు. దేశీయ విమాన సర్వీసులలో బెంగళూరు, చెన్నైకు ఎక్కువమంది ప్రయాణించారు.